విద్యుత్ ప్రమాద నివారణపై అవగాహన

బిచ్కుంద, మే 3: వేసవి కాలంలో జరిగే విద్యుత్ ప్రమాదాల నివారణ కోసం సిబ్బందికి డీఈ వెంకట రంగయ్య శుక్రవారం అవగాహన కల్పించారు. నిరంత విద్యుత్ సరఫరా అందిస్తూ అనుకోకుండా చోటు చేసుకునే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అగ్ని ప్రమాదాల పట్ల జాగ్రత్తల విధి విధానాలను తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై నిఘా ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ డివిజన్ కామేశ్వరరావు, పిట్లం ఏడీఈ బాలాజీ, బిచ్కుంద ఏఈ పవన్‌కుమార్, ప్రమోద్‌రెడ్డి, బలరాం, లైన్ ఇన్‌స్పెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఓటింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

- పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం
- ఇటీవల తుది ఓటరు జాబితా విడుదల
- పార్లమెంట్ పరిధిలో మొత్తం 16.40లక్షల ఓట్లు
- 1974 పోలింగ్ కేంద్రాలు
- 7,800 మందికి పైగా పోలింగ్ సిబ్బంది నియామకం
- ఓటింగ్ శాతం పెంచేలా ప్రణాళిక

కామారెడ్డి, మే 5(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని కామారెడ్డి జిల్లాలో లోక్‌సభ ఎన్నికల కోసం జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉంది. ఇటీవల తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 16.40 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడడం, నామినేషన్ల ఘట్టం సైతం పూర్తి కావడం, బరిలో 11 మంది అభ్యర్థులు ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆయా ప్రధాన పార్టీల అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేపడుతున్నారు. మరోవైపు అధికార యంత్రాంగం జిల్లాలో లోక్‌సభ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందించారు. ఈవీఎంల చెకింగ్ సైతం పూర్తయింది. పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. పోలింగ్ విధుల కోసం సిబ్బందిని నియమించారు. ఈనెల 13న పోలింగ్ నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేస్తోంది.

పార్లమెంట్ పరిధిలో 16.40 లక్షల ఓట్లు

జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోకి కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజక వర్గాలు వస్తాయి. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మూడు రోజుల క్రితం ఎన్నికల కమిషన్ తుది ఓటరు జాబితాను విడుదల చేసింది. పార్లమెంట్ పరిధిలో మొత్తం 16,40,755 ఓట్లు ఉండగా ఇందులో మహిళలవి 8,39,133, పురుషులవి 8,01,563, ఇతరులవి 59 ఓట్లు ఉన్నాయి. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓట్లు 2,54,626 ఉండగా ఇందులో మహిళలవి 1,32,301, పురుషులవి 1,22,306, థర్డ్ జండర్‌వి 19 ఓట్లు ఉన్నాయి. ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓట్లు 2,23,009 ఉండగా ఇందులో మహిళలవి 1,16,131, పురుషులవి 1,06,876, థర్డ్ జండర్‌వి 2 ఓట్లు ఉన్నాయి. జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓట్లు 2,02,769 ఉండగా ఇందులో మహిళలవి 1,03,286, పురుషులవి 99,474, థర్డ్ జండర్‌వి 9 ఓట్లు ఉన్నాయి. బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓట్లు 1,96,691 ఉండగా ఇందులో మహిళలవి 1,02,990, పురుషులవి 93,688, థర్డ్ జండర్‌వి 13 ఓట్లు ఉన్నాయి. జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓట్లు 2,75,562 ఉండగా ఇందులో మహిళలవి 1,37,866, పురుషులవి 1,37,694, థర్డ్ జండర్‌వి 2 ఓట్లు ఉన్నాయి. ఆందోల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓట్లు 2,50,857 ఉండగా ఇందులో మహిళలవి 1,28,186, పురుషులవి 1,22,666, థర్డ్ జండర్‌వి 5 ఓట్లు ఉన్నాయి. నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓట్లు 2,37,241 ఉండగా ఇందులో మహిళలవి 1,18,373, పురుషులవి 1,18,859, థర్డ్ జండర్‌వి 9 ఓట్లు ఉన్నాయి.

1974 పోలింగ్ కేంద్రాలు

జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1974 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కామారెడ్డి పరిధిలో 296, ఎల్లారెడ్డి 270, జుక్కల్ 255, బాన్సువాడలో 258, జహీరాబాద్‌లో 314, ఆందోల్‌లో 313, నారాయణఖేడ్ 208 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ప్రొసీడింగ్ అధికారి, సహాయ ప్రొసీడింగ్ అధికారులతో పాటు మరో ఇద్దరు చొప్పున సిబ్బందిని నియమించనున్నారు. వీరితో పాటు నాలుగు నియోజకవర్గాలకు కలిపి 199 మైక్రో అబ్జర్వర్‌లను నియమించారు. ఈ లెక్కన పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1974 పోలింగ్ కేంద్రాల్లో 7894 మంది పోలింగ్ సిబ్బందిని నియమించనున్నారు. ఇందులో పీవోలు 1974 మంది, ఏపీవోలు 1974, ఓపీవోలు 3948 మంది విధులు నిర్వహించనున్నారు.

ఒక్కో బూత్‌కు రెండు బ్యాలెట్ యూనిట్లు

జిల్లాలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఓటింగ్ యంత్రాలను నిపుణులతో పరిశీలన పూర్తయ్యాయి. ఎన్నికలకు ఓటింగ్ యంత్రాలను సైతం సిద్ధంగా ఉంచారు. జహీరాబాద్ లోక్‌సభ స్థానంలో మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ లెక్కన జిల్లా లోని ఒక్కో పోలింగ్ బూత్‌కు రెండు బ్యాలెట్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఓటింగ్ కోసం ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్లను సిద్ధం చేశారు. 2794 బ్యాలెట్ యూనిట్లు, 1702 ఈవీఎంలు, 1218 వీవీప్యాట్ యూనిట్లను పోలింగ్‌కు సిద్ధంగా ఉంచారు.

ఇంటింటా ఓటరు స్లిప్పుల పంపిణీ.. నేడు, రేపు హోం ఓటింగ్

ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ జరగనున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో ప్రతీ ఇంటింటికి ఓటరు స్లిప్పులను పంపిణీ చేపడుతున్నారు. అదేవిధంగా వృద్ధులు, వికలాంగుల కోసం హోం ఓటింగ్ కార్యక్రమాన్ని నేడు, రేపు నిర్వహించనున్నారు. జిల్లాలో 85 సంవత్సరాల పైబడిన 181 మంది వృద్ధులు, 258 మంది వికలాంగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందుకోసం 25 ప్రత్యేక హోం ఓటింగ్ బృందాలను ఏర్పాటు చేసి 12 రూట్ల ద్వారా ఈ ప్రక్రియ నిర్వహించనున్నారు. అదేవిధంగా ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులకు సైతం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 4546 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరికి సైతం నేడు, రేపు ఆయా నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



భారీ వర్షాల కారణంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి టౌన్, మే 3: జిల్లాలో రాబోయే మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం మానిటరింగ్ అధికారులు, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్‌లు, లారీ ట్రాన్స్‌ఫోర్ట్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈనెల 5 నుంచి 7 వరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా అవసరమైన టార్పాలిన్లు, గోనె సంచులు కేంద్రాల్లో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించుటకు కొనుగోలు కేంద్రాలకు అవసరమైన లారీలను అందించాలని ట్రాన్స్‌పోర్టు అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎటువంటి ఆలస్యం చేయకుండా రాత్రి పొద్దుపోయాక కూడా కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి ట్యాగ్ చేసి మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీ కూడా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైస్‌మిల్లుల యజమానులు కూడా ఎటువంటి ఆలస్యం చేయకుండా వచ్చిన ధాన్యాన్ని వెంటనే లారీల నుంచి అన్‌లోడ్ చేసుకొని ట్రక్ షీట్ జారీ చేయడంతో పాటు వంద శాతం ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్‌బాబు, మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.


టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కూలీలకు ఉపాధి కల్పిస్తూ రూ.300 చెల్లించేలా చూడాలి

కామారెడ్డి టౌన్, మే 3: మండలాలలో ఉపాధి హామీ పథకం కింద ప్రజలకు అవసరమైన వివిధ పనులను గుర్తించి కూలీలకు ఉపాధి కల్పిస్తు కనీస వేతనం రూ.300 చెల్లించేలా చూడాలని రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్‌డీవో చందర్‌నాయక్‌తో కలిసి కూలీల హాజరు శాతం, కనీస వేతనం, పని ప్రాంతాల్లో సౌకర్యాలపై ఎంపీడీవోలు, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ కన్సలెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని మండలాల్లో కూలీల హాజరు, కనీస వేతనం చాలా తక్కువగా ఉందని, రాబోయే వారం రోజుల్లోగా సమీక్షించి హాజరు శాతం, కనీస వేతనం పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కూలీలకు వడదెబ్బ తగలకుండా పనిచేసే చోట టెంట్లు, మంచినీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో ఆయా మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లి


బీర్కూర్ రోడ్ షోలో మాట్లాడుతున్న బీబీ పాటిల్

మోదీ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా..

● జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్

బీర్కూర్/కామారెడ్డి టౌన్/బాన్సువాడ టౌన్/దోమకొండ, మే 3: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని, ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని జహీరాబాద్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. శుక్రవారం ఆయన బీర్కూర్, కామారెడ్డి, దోమకొండ, బాన్సువాడల్లో పర్యటించి మాట్లాడారు. బీర్కూర్ మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో కలిసి రోడ్ షో నిర్వహించారు. అనంతరం కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. కేంద్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, ముచ్చటగా మూడోసారి ప్రధాని కాబోయేది నరేంద్రమోదీనే అని ధీమా వ్యక్తం చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా తనకు పార్టీ అవకాశం కల్పించిందని, ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించాలని ఆయన కోరారు. దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా పని చేసి బీజేపీ విజయానికి కృషి చేయాలన్నారు. కాగా కామారెడ్డి పట్టణంలోని రాజారెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కామారెడ్డి రూరల్, రాజంపేట మండల బీజేపీ నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అప్ కిబార్ చార్ సౌపార్‌లో జహీరాబాద్ పార్లమెంట్ సీటు కూడా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. బీబీ పాటిల్‌కు ఓటు వేస్తే మోదీకి వేసినట్లేనని పేర్కొన్నారు. అనంతరం బీబీ పాటిల్ మాట్లాడుతూ దేశంలో మోదీవేవ్ నడుస్తుందన్నారు. దేశంలో మోదీ ప్రధాని కావాలంటే జహీరాబాద్ గడ్డపై కాషాయజెండాను ఎగురవేసి మోదీకి బహుమతిగా ఇద్దామని అన్నారు. బాన్సువాడ పట్టణంలో రాత్రి అంబేద్కర్ చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్‌లో బీబీ పాటిల్ మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ హయాంలో భారతదేశం విశ్వఖ్యాతి గాంచిందన్నారు. మోదీ భారతదేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథం వైపునకు తీసుకెళుతున్నారన్నారు. నేడు ప్రపంచ దేశాల సరసన భారతదేశం నిలబడిందంటే అది కేవలం మోదీతోనే సాధ్యమైందన్నారు. దోమకొండలో ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి దోమకొండ సబ్‌స్టేషన్ వద్ద నుంచి బైక్ ర్యాలీని ప్రారంభించి కొత్త బస్టాండ్, అంగడి బజార్, శివరాంమందిర్, బురుజు, పలుగడ్డ, మసీదు పాత బస్టాండ్ మీదుగా పెద్దమ్మ ఫంక్షన్ హాల్‌కి ర్యాలీగా చేరుకున్నారు. పెద్దమ్మ ఆలయంలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి బీబీ పాటిల్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటమి భయంతో కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తుందని ప్రజలు వారి మాటలు నమ్మరన్నారు. అనంతరం బీబీ పాటిల్ మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధిని చూసి బీజేపీకి ఓటు వేయలన్నారు. ఆయన వెంట రాష్ట్ర బీజేపీ నాయకులు యెండల లక్ష్మీనారాయణ, సౌదాగర్ గంగారాం, సాయి కిరణ్, సున్నం సాయిలు, మాధవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించి.. లక్షణంగా మరిచారు!

- చాలా గ్రామాల్లో నిరుపయోగంగా డంపింగ్ యార్డులు
- పాత బావులు, గుంతల్లో చెత్త పారబోత
- పలుచోట్ల నిప్పు.. అనారోగ్యం పాలవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

భిక్కనూరు, మే 3: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉండాలని, గ్రామాల్లో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేసి గ్రామ పంచాయతీల ఆదాయం పొందడానికి రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డులు ప్రస్తుతం చాలా గ్రామాల్లో నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో పరిశుభ్రతకు లక్షలు రూపాయలను వెచ్చించి డంపింగ్ యార్డులను నిర్మించి, ట్రాక్టర్లను కొనుగోలు చేశారు, కానీ తడి పొడి చెత్తను వేరు చేయాలని చెత్తను రోడ్లపై వేయవద్దని కేవలం గ్రామ పంచాయతీ ట్రాక్టర్లలోనే వేయాలని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టిన గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది మాత్రం చాలా గ్రామాల్లో డంపింగ్ యార్డులను వినియోగించడం లేదు. కొన్ని గ్రామాల్లో చెత్తను రెండు రోజులకు ఒకరి సేకరిస్తుంటే, మరికొన్ని గ్రామాల్లో మూడు రోజులకు ఒక్కసారి సేకరిస్తున్నారు. పెద్ద గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాల్లో మాత్రం రోజు సేకరిస్తున్నారు. రోజు, రెండు రోజులకు, మూడు రోజులకు సేకరిస్తున్న చెత్తను కూడా చాలా గ్రామాల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది డంపింగ్ యార్డుకు కాకుండా పాత బావులు, చెరువు గట్టులు, గుంతల్లో పారబోసి కాల్చేస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారి పేకాట రాయుళ్లకు, మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి.

చాలా డంపింగ్ యార్డుల్లో సేంద్రియ ఎరువుల తయారీ జాడలేదు

జిల్లాలోని దాదాపుగా అన్ని గ్రామాల్లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ డంపింగ్ యార్డులను నిర్మించగా, ఒక్కో గ్రామంలో వీటి నిర్మాణానికి రూ.లక్షలు ఖర్చు చేసింది. ఈ డంపింగ్ యార్డుల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుల తయారీతో పాటుగా వానపాములను ఉత్పత్తి చేయాలని ఈ కార్యక్రమం ఉద్దేశ్యం. డంపింగ్ యార్డుల్లో తయారు చేసిన సేంద్రియ ఎరువులను రైతులకు విక్రయిస్తే గ్రామ పంచాయతీలకు కొంత ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వ ఆలోచన. కానీ జిల్లాలోని చాలా గ్రామాల్లో నిర్మించిన డంపింగ్ యార్డుల్లో సేంద్రియ ఎరువుల తయారీ కన్పించడం లేదు. అసలు వీటిల్లో చెత్తనే వేయడం లేదు.

పాత బావులు, గుంతల్లో పారబోత

గ్రామాల్లో సేకరించిన చెత్తను పలు కారణాలతో గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామాలకు సమీపంలోని పాత బావులు, గుంతల్లో, చెరువు గట్టు వద్ద పారబోస్తున్నారు. ఇలా రెండు, మూడు సార్లు పారబోసిన చెత్త రోడ్లపైకి, బహిరంగ ప్రదేశాలకు రాకుండా గ్రామ పంచాయతీ సిబ్బంది నిప్పుపెడుతూ చేతులు దులుపుకుంటున్నారు. వీటిల్లో పారబోసిన చెత్తకు నిప్పు పెట్టడంతో దీని నుంచి వచ్చే పొగ గంటల తరబడి గ్రామాలను చుట్టేస్తోంది. దీంతో చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అస్తమా రోగుల బాధలు వర్ణణా తీతం. ఈ చెత్త నుంచి వచ్చే పొగతో, దుర్వాసనతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నిప్పు కారణంగా చుట్టూ ఉండే చెట్లు కాలిపోతున్నాయి. పొగ వస్తున్న సమయంలో ఆ వైపు వెళ్లే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ చెత్తకు నిప్పంటిచడంతో చెత్తలో ఉండే బల్బులు, ఫర్ఫ్యూమ్ బాటిళ్లు, ఇతరితర వస్తువులు పేలుతున్నాయి. ఈ సమయంలో వచ్చే శబ్దంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

ఎక్కువ డీజిల్ అవసరమవుతుందనే ఇలా..

గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో ప్రతీ రోజు ఇంటింటికీ తిరుగుతూ చెత్తను సేకరించి గ్రామ చివర్లో ఉన్న డంపింగ్ యార్డుకు తరలించాలంటే డీజిల్ ఎక్కువగా అవసరమై గ్రామ పంచాయతీకి ఖర్చు ఎక్కువ అవుతోంది. దీంతో పాటుగా ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేయకుండా ఒకేచోట చెత్తను జమచేసి ట్రాక్టర్‌లో వేస్తున్నారు. ఇలా వేసిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి ఇందులో తడి, పొడి వేరుచేయడానికి గ్రామ పంచాయతీ సిబ్బందికి చాలా సమయం పడుతోంది. దీంతో గ్రామ సమీపంలో ఉండే పాత బావులు, గుంతల్లో చెత్తను పారబోసి నిప్పంటిస్తున్నారు. కాగా డీజిల్ ఎక్కువ కాలుతుందన్న ఉద్దేశ్యంతో చాలా గ్రామాల్లో చెత్త సేకరణను రెండు, మూడు రోజులకు ఒక్కసారి చేపడుతున్నారు. దీంతో చెత్త ఎక్కువ కావడంతో ప్రజలు అంతా ఒకే చోట పెడుతున్నారు. గ్రామాల్లో మారోమారు ప్రజలను అవగాహన పర్చడంతో పాటుగా ప్రతీరోజు అన్ని గ్రామాల్లో చెత్త సేకరణ చేస్తే సేంద్రియ ఎరువుల తయారీ చేయడానికి ఎక్కువగా అవకాశాలు ఉంటాయని పలువురు సూచిస్తున్నారు.


చెత్తను కాల్చి వేస్తున్న దృశ్యం



పెద్దమల్లారెడ్డిలో వరిధాన్యం కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

'తూకం వేసిన బస్తాలను వెంటనే రైస్ మిల్లులకు పంపించాలి'

భిక్కనూరు, మే 3: వరి కొనుగోలు కేంద్రాల వద్ద తూకం వేసిన బస్తాలను వెంటనే రైస్‌మిల్లులకు పంపించాలని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ అధికారులు శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను వారు పరిశీంచారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్ ఎంట్రీ, తూకం, ఇతరితర వసతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు ధాన్యం విక్రయించిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేసి రైతులకు డబ్బులు సకాలంలో అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు, కిష్టయ్య, రమేష్, ఆయావిండోల సీఈవోలు మోహన్‌గౌడ్, నర్సింలు, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య

ముప్కాల్, మే3: బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామానికి చెందిన రొండ్ల అనిల్(27) అనారోగ్యంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి బాల్కొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్‌కు గత కొన్ని రోజులుగా కిడ్నీలో రాళ్ల సమస్యతో ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నాడు. అయిన గత కొన్ని రోజులుగా మళ్లీ రావడంతో తాగుడుకు బానిసై గత నెల 26న తన వ్యవసాయ తోటలో గడ్డి మందును తాగాడు. కాగా, నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతు శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై గోపి తెలిపారు. ఎనిమిది నెలల క్రితం మృతుని భార్య మానస అలియస్ మౌనిక గోడవ పడి పుట్టిం టికి వెళ్లింది. మృతుడి తండ్రి రొండ్ల లింగన్న ఇచ్చిన పిర్యాదు మేరకే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'బీజేపీ ప్రజావ్యతిరేక పార్టీ'

మోపాల్, మే 3: కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను పాల్పడుతుందని ఈ ఎన్నికల్లో ఓట్లు వేయవద్దని సీపీఐఎంఎల్ ప్రజాపంథ నాయకుడు సాయాగౌడ్ ప్రజలను కోరారు. శుక్రవారం మేడే ఉత్సవాల్లో భాగంగా సిర్పూర్ గ్రామంలో మేడే జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ఏర్గట్ల, మే 3: మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాళ్లరాంపూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దిబ్బ సుదర్శన్‌తో పాటు గుమ్మడి దేవేందర్, శ్రీను, ఆనంద్‌లతో పాటు పలువురు పార్టీలో చేరారు. ఇందులో పార్టీ మండలాధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు గంగాప్రసాద్, తదితరులున్నారు.

హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ హక్కును వినియోగించుకోవాలి : అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి

మద్నూర్, మే 3: శనివారం, ఆదివారం రెండు రోజుల్లో 85 సంవత్సరాలు పై బడినవారు, పూర్తిగా అంగవైకల్యం కలిగిన వారు ఇంటి వద్ద నుంచే ఓటువేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జుక్కల్ నియోజకవర్గం అసిస్టెంట్ ఎన్నికలరిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మద్నూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 85 సంవత్సరాలు పై బడిన వారికి, పూర్తిగా అంగవైకల్యం ఉన్న వారికి ఇంటి వద్ద ఓటు వేసే అవకాశం కల్పించిందని, ఫారం 12 డి ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు విధులు నిర్వహిస్తున్న ఆయా శాఖల ఉద్యోగుల కోసం పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకోవడానికి జహీరాబాద్ పార్లమెంట్, ఇతర పార్లమెంట్ పరిధిలో ఓటు హక్కు ఉండి జుక్కల్‌నియోజకవర్గం పరిధిలో ఉద్యోగం చేస్తూ ఎన్నికల విధులు నిర్వహిస్తున్నవారి కోసం మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో 3 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లుతెలిపారు. ఈ నెల 4వ తేది నుంచి 8వ తేది వరకు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.



మాట్లాడుతున్న జుక్కల్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



ఎవరెస్ట్‌పై త్రివర్ణ పతకాన్ని ఎగురవేస్తున్న లోక రాములు

ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించిన నూత్‌పల్లివాసి రాములు

డొంకేశ్వర్, మే3: మండలంలోని నూత్‌పల్లి గ్రామానికి చెందిన లోక రాములు ఎవరెస్ట్ మంచు పర్వతాన్ని అధిరోహించారు. వివిద రాష్ర్టాలకు చెందిన 16మంది సభ్యులతో కలిసి తెలంగాణ నుంచి ఆరుగురు సభ్యులు ఈ మంచు పర్వతాన్ని అధిరోహించడానికి 22న బయలుదేరి వెళ్లారు. నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామానికి చెందిన లోక రాములు ఒక్కడే ఉండడం గమనార్హం. మాలవత్ పూర్ణ ఆధ్వర్యంలో ట్రాక్ అనే కంపెనీ ద్వారా 16మంది సభ్యులు 12రోజుల పాటు రోజుకి ఆరు నుంచి ఎనిమిది గంటల ట్రాకింగ్ చేసి పర్వత రోహన్ని అదిరోహించి త్రివర్ణ పతకాన్ని ఎగురవేశారు. తాము అదిరోహించిన మంచు పర్వతం సుమారు 5364మీటర్ల ఎత్తులో ఉంటుందని వివరించారు. నూత్‌పల్లి నుంచి పర్వతరోహణ చేపట్టిన రాములు రైతుగా వ్యవసాయం చేస్తూ తన సొంత ఖర్చులతోనే ఈ పర్వతరోహణం చేపట్టాడు. జీవితంలో ఎవరెస్టు శిఖిరాన్ని ఒక్కసారైన అదిరోహించానికి ప్రయత్నం చేయాలని ఆయన కోరారు.

ఆలూర్ విద్యార్థులను అభినందించిన జిల్లా విద్యాశాఖ అధికారి

ఆర్మూర్‌రూరల్, మే3: ఆలూర్ జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులను శుక్రవారం జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ అభినందించారు. ఇటీవల వెల్లడైన పదవ తరగతి పరీక్షల్లో పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు 10జీపీఏ సాధించారు. 10జీపీఏ సాధించిన విద్యార్థులు రక్షిత, సాయిమాధుర్య, సవిత, శరణ్య, భవజ్ఞ, దేవనంద్‌తో పాటు హెచ్‌ఎం నరేందర్‌ను డీఈవో దుర్గాప్రసాద్ అభినందించారు.

బందళ్ల రోడ్డును పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

రెంజల్, మే 3: మండల కేంద్రంలోని బందళ్ల రోడ్డు పనులను ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రూ.3కోట్ల 45లక్షలతో రోడ్డును ప్రారంభించారని, రైతుల ప్రయోజనం కోసం బందళ్ల రోడ్డు నిర్మాణ పనులను చేపట్టిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. బందళ్ల రోడ్డు పనులను శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పంట పొలాలకు వెళ్లే బందళ్ల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా రూ.3కోట్ల 45లక్షలతో రోడ్డు పనులను వెంటనే ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఇందులో మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, మాజీ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు రమేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు రాములు, సాయిబాబా గౌడ్, జావీదోద్దీన్, సాయిరెడ్డి, ధనుంజయ్, పోచయ్య, మోహన్, నర్సయ్య, ప్రభాకర్, తదితరులున్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు


వర్నిలోని డిగ్రీ కళాశాలలో తనిఖీలు చేస్తున్న అధికారులు

కామారెడ్డి డిగ్రీ కళాశాలలో..
టీయూ ఆడిట్ సెల్ అధికారుల తనిఖీలు

డిచ్‌పల్లి, మే3: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో అనుబంధ కళాశాలలు కొనసాగుతున్న వర్ని మండల కేంద్రంలోని ఎమ్‌జేపీటీ, విజయ, బాన్సువాడలో గల ఎస్ఆర్ఎస్ఎన్‌కే, ఎస్ఎస్ఎల్, శంశాంక్, బిచ్కుందలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మద్నూర్‌లో గల జీడీసీ, రత్నా కళాశాల, జుక్కల్‌లో గల రేయిన్‌బో మరియు పిట్లం మండలకేంద్రంలో ఎస్వీ డిగ్రీ కళాశాలలను శుక్రవారం తెలంగాణ వర్సిటీ ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. 2024-25 విద్యాసంవత్సరానికి అనుమతుల తనిఖీల్లో భాగంగా ఈతనిఖీలు చేపట్టిన్నట్లు ఘంట చంద్రశేఖర్ తెలిపారు. యూజీసీ, ఉన్నత విద్యమండలి నిబంధనల మేరకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నమని, ప్రతీ కళాశాలలో ఉన్న వసతులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని ఆయన తెలిపారు. తనిఖీల కార్యక్రమంలో ఆడిట్‌సెల్ డైరెక్టర్‌తోపాటు జాయింట్ డైరెక్టర్ అతిఖ్ సుల్తాన గోరి, రాంబాబు, ఆరతి, లావణ్య, ఇంగ్లీశ్ విభాగాధిపతి రమణ చారి, కెమిస్ట్రీ విభాగాధిపతి నాగరాజు ఉన్నారు.

ఒకే గొడుగు కింద
బీఆర్ఎస్, బీజేపీ ఎన్నికల ప్రచారం

ఇందల్వాయి, మే 3: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామంలో శుక్రవారం ముందుగా బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించగా.. అది ముగిసిన వెంటనే బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా బీజేపీ జెండాలు, ఫ్లెక్సీలతో కనిపించిన సభా ప్రాంగణం సమావేశం ముగియగానే ఫ్లెక్సీలు, జెండాలను తీసివేసి బీఆర్ఎస్ జెండాలను మార్చిఅక్కడున్న ప్రజలతోనే బీఆర్ఎస్ ప్రచారం జరగడంతో అందరూ చర్చించుకున్నారు.

వీరన్నగుట్టలో ఇల్లు దగ్ధం


కాలిపోయిన ఇంటిలోని వస్తువులు

రెంజల్, మే 3: మండలంలోని వీరన్నగుట్ట గ్రామానికి చెందిన గుంజి రజితకు చెందిన ఇల్లు దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. ఇంట్లోని 10వేల నగదుతోపాటు వంట సామగ్రి, దుస్తులు పూర్తిగా దగ్ధమైనట్లు బాధితులు పేర్కొన్నారు. ఇల్లు గృహం పూర్తి కాలిపోవడంతో కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితురాలు కోరుతోంది.

సీఆర్‌పీఎఫ్ జవాన్ల పోలీసు కవాతు

ఇందల్వాయి, మే3: పార్లమెంట్ ఎన్నికల బందోబస్తులో భాగంగా ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామానికి వచ్చిన సీఆర్‌పీఎఫ్ జవాన్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, ఐపీఎస్ ఆదేశాలమేరకు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాఎగరవేసి గ్రామంలోని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఎస్సైలు మహేష్, మనోజ్ కుమార్, తిరుపతి, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫక్రుద్దీన్, సిబ్బంది ఉన్నారు.

అర్వింద్‌పై గల్ఫ్ కార్మికుల చార్జ్‌షీట్


మాట్లాడుతున్న టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్

డిచ్‌పల్లి, మే3: డిచ్‌పల్లిలో గల్ఫ్‌కార్మికులు శుక్రవారం బీజేపీ అభ్యర్థిపై చార్జ్‌షీట్ విడుదల చేశారు. గల్ఫ్ కార్మికులను ఓట్లు అడిగే ముందు నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ సమాధానం చెప్పాలని టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ నంద భీమ్‌రెడ్డి డిమాండ్‌చేశారు. గల్ఫ్ దేశాల్లో భారతీయ కార్మికులకు అండగా కంపెనీలు ఇస్తున్నా కనీస వేతనాలను కేంద్రంలోని బీజేపీ ప్ర భుత్వం 30శాతం నుంచి 50శాతం తగ్గిస్తూ 2020 సెప్టెంబర్‌లో రెండు సర్క్యులర్‌లను జారీచేసి కార్మికుల పొట్టకొట్టిందని అన్నారు. ప్రవాసీ భారతీయ బీమా యోజన 10లక్షల ప్రమాద బీమాలో సహజ మరణానికి చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదన్నారు. హైదరాబాద్‌లో, సౌదీ అరేబి యాలో, కువైట్ దేశాల దౌత్యకార్యాలయాలు ఏర్పాటుకోసం ఎన్నిసార్లు విజ్ఞప్తిచేసినా చేసిన కేంద్ర ప్రభుత్వం ఎందుకు చొరవచూపలేదని ప్రశ్నించారు. సమావేశంలో గల్ఫ్‌జేఏసీ చైర్మన్ గుగిళ్ల రవిగౌడ్, నాయకులు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, స్వదేశ్‌భీమ్‌రెడ్డి, చిన్నరెడ్డి, సంతోశ్‌రెడ్డి, న వీన్‌గౌడ్, గల్ఫ్‌కార్మికులు పండరి, రవీందర్, మోహన్, యాదగిరి ఉన్నారు.

వరి కొయ్యలను కాల్చొద్దు

- సారం కోల్పోతున్న భూములు
- పంట దిగుబడి తగ్గుతోంది..
- పొలాన్ని కలియదున్నితేనే పంటలకు మేలంటున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు

డొంకేశ్వర్, మే3: గతంలో వరి పంటను కొడవళ్లతో మొదళ్ల వరకూ కోసేవారు. రైతులకు పశువులు ఎక్కువగా ఉండడంతో గడ్డిని కుప్పలుగా పశుగ్రాసం కోసం నిల్వ చేసేవారు. అయితే ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులొచ్చాయి. పశువుల సంఖ్య తగ్గిపోవడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. హార్వేస్టర్ మిషన్‌తో వరిపంటను కోసే సమయంలో పైకి కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. అవసరమున్న రైతులు గడ్డిని తీసుకువెళ్తున్నారు. దీంతో దున్నే సమయంలో నాగళ్ళకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరికొయ్యాలను తగులబెడుతున్నారు. దీని వల్ల అధిక నష్టాలు వచ్చే అవకాశాముందని ఎట్టి పరిస్థితిలోనూ వరి కొయ్యాలను తగులబెట్టొద్దని రైతులకు వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.


డొంకేశ్వర్‌లో పంట పొలాల్లో వరి కొయ్యలను తగులబెడుతున్న దృశ్యం (ఫైల్)

● సారం కోల్పోతున్న భూములు

వరి కొయ్యలను కాల్చితే నష్టామే తప్ప ఎలాంటి ప్రయోజనమూ ఉండదని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. కాల్చడం ద్వారా వీపరితమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతోంది. వరి నాటిన తర్వాత కొనలు తెల్లవారటం జరుగుతుంటుంది. ముఖ్యంగా పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు, రైతుమిత్ర పురుగులు నశిస్తాయి. దీంతో పంట దిగుబడి సరిగా రాదు. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవకాశాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. పొలాల్లో తిరిగే పాములు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక జీవరాసులు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. పొలాల గట్టు మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కాలిపోవడంతో పర్యవరణానికి హాని కలుగుతుందని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు.

● పొలాన్ని కలియదున్నితేనే లాభాలు

కొయ్యలను నేలలో కలియదున్నడంతో సేంద్రియ కార్బన్ శాతం పెరిగి దిగుబడులు అధికంగా వచ్చే అవకాశముంది. దుక్కిదున్నే సమయంలో సింగిల్ సూపర్‌పాస్పెట్ చల్లితే వరికొయ్యలు మురిగి కొద్దిరోజుల్లో పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. మందుల వాడకం సగం వరకు తగ్గుతుంది. సూపర్‌పాస్పెట్ చల్లితే భూమిలో మందుల వాడకం తగ్గుతుంది. సేంద్రీయ పదార్థాలు స్థాయిని పెంచుతుంది. దీంతో నీటి నిలువ చేసుకుని సామర్థ్యమూ పెరిగితుంది. నేలలో కరుగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చుతుంది.

కొయ్యలను పొలంలోనే దున్నాలి..

● మౌనిక, వ్యవసాయ విస్తీర్ణాధికారి

వరి కొయ్యలను నిప్పులతో కాల్చడం ద్వారా భూమి సారాన్ని కోల్పోతుంది. వరి కొయ్యలను పొలంలోనే దున్ని నీరు పెట్టి సింగిల్ సూపర్ పాస్పెట్ చల్లితే కుళ్లిపోయి సేంద్రియ పదార్థాల శాతం పెరుగుతుంది. దీంతో ముఖ్యంగా పంటలకు ఉప యోగపడే సూక్ష్మజీవులు, పురుగులు నశిస్తాయి.


భక్తులకు హితబోధ చేస్తున్న పిట్ల కృష్ణ మహరాజ్

శివనామస్మరణతో సకల శుభాలు

బోధన్‌రూరల్, మే 3: నిత్యం శివనామస్మరణతో సకల శుభాలు చేకూరుతాయని మల్లారం శ్రీ బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్ అన్నారు. శుక్రవారం బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో అఖండ హరినామ సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ భగవాన్ నామ స్మరణతోనే కోరిన కోర్కెలు నెరవేరుతాయని ఆయన పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో సప్తాహ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు నిత్యం శివనామస్మరణ చేస్తే సకల శుభాలు కలుగుతాయని అన్నారు. ప్రతీ ఒక్కరు భక్తిమార్గంలో నడవాలని అన్నారు. భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ గంగాధర్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, సప్తాహ నిర్వాహకులు మొగులయ్య, లక్ష్మణ్, పీరాజి, దిగంబర్, అశోక్, శివప్రసాద్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రెంజల్, మే 3: నేడు మండల ప్రజా పరిషత్ చైర్మన్ లోలపు రజిని కిషోర్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నేడు జరిగే మండల సర్వసభ్య సమావేశానికి మండల అధికారులు, ప్రజాప్రతినిధులు అందరు హజరు కావాలని ఆయన అన్నారు.


హెగ్డోలిలో ప్రారంభమైన శివనామ సప్తాహ

హెగ్డోలిలో అఖండ శివనామ సప్తాహ

కోటగిరి, మే 3: పొతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామంలో శుక్రవారం అఖండ శివనామ సప్తాహ ప్రారంభమైంది. సప్తాహను సుంకిని మహరాజ్ సిద్ది లింగాప్ప స్వామి ప్రారంభించారు. వారం రోజులపాటు సప్తాహ కొనసాగనుంది. సప్తాహతో గ్రామాలలో భక్తిభావన పెంపొందుతుందని ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

ఎడపల్లి, మే3: మండల కేంద్రానికి చెందిన బండి శ్రీనివాస్ గౌడ్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతని భార్య ఉమకు రూ.లక్ష జీవిత బీమా చెక్కును శుక్రవారం భీమా డెవలప్‌మెంట్ అధికారి సుభాష్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో కేసని ప్రభాకర్ గౌడ్, నాగాగౌడ్, నర్సాగౌడ్, రేణుకాదాస్ గౌడ్, బాలరాజు గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, మల్లాగౌడ్, కళ్యాణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.


బీమా చెక్కును అందజేస్తున్న దృశ్యం

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉందాం

● కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

సిరికొండ,మే3: విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పలు సూచనలు పాటించాలని సిరికొండ ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. సిరికొండ మండల కేంద్రంలో శుక్రవారం భద్రత సూచలను తెలిపే కరపత్రాలను చంద్రశేఖర్ తన సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ వర్షాకాలంలో ఈదురు గాలుల వల్లనో, ప్రకృతి వైపరీత్యాల వల్ల తీగలు తెగిపోవడం,సాగడం, స్తంభాలు విరుగడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, ఎర్తింగ్ విఫలమవ్వడం, అజాగ్రత్తగా వ్యవహరించే వినియోగదారులు విద్యుత్ ప్రమాదాలకు గురవుతుంటారని అన్నారు. గ్రామీణ ప్రాంత వినియోగదారులందరూ భద్రత సూచలను పాటించాలని కోరారు రైతులు తమ అవసరాల నిమిత్తం వ్యవసాయ పంపుసెట్లను వినియోగించేటప్పుడు, ఏమరుపాటుతో పైపులను, స్టార్టర్ డబ్బాలను ముట్టుకోవద్దని ఆయన సూచించారు. వర్షాలు కురిసినప్పుడు విద్యుత్ స్తంభాలను, తెగిపడిన తీగలను, స్టార్టర్లను, మోటార్లను తాకవద్దన్నారు. డిస్ట్రిబ్యూటర్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారికంగా ఫ్యూజ్‌లు మార్చడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరమని ఏఈ వివరించారు. సర్వీస్ వైర్లను, వీధిదీపాలని సరిచేసేందుకు ఇతరులు విద్యుత్ స్తంభాలను ఎక్కొద్దని, సంస్థ సిబ్బంది సమయం కోరడం తప్పనిసరిని చెప్పారు. వినియోగదారులు బద్రత చర్యలను కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

గడ్డిని కాల్చేందుకు వెళ్లి..
అదే మంటల్లో పడి రైతు మృతి

సిరికొండ, మే3: పొలం కోయగా మిగిలిన గడ్డిని కాల్చేందుకు యత్నించి.. అవే మంటలు అంటుకొని ఓ రైతు మృతి చెందిన ఘటన సిరికొండ మండలం పెద్దవాల్గోట్‌లో ఆలస్యంగా శుక్రవారం వెలుగు చూసింది. పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన రైతు లాయిడి కిషన్(35)కు పోత్నూర్ గ్రామ శివారులో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇటీవల తన పొలం కోయగా మిగిలిన గడ్డిని కాల్చేందుకు గురువారం పొలం వద్దకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తూ అవే మంటలు అంటుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కిషన్ గురువారం రాత్రి వరకు రాకపోవడంతో.. కుటుంబీకులకు అనుమానం వచ్చి శుక్రవారం పొలం వద్దకు వెళ్లారు. అక్కడ కిషన్ కాలిన శవం కనిపించడంతో ఈ ఘటన వెలుగుచూసింది. కిషన్‌కు కాళ్ల నొప్పులు ఉండడంతో నడువలేని స్థితిలో మంటల్లో చిక్కుకుని చనిపోయి ఉంటాడని గ్రామస్థులు అనుమానిస్తున్నారు. కిషన్ మరణించి తీరు గ్రామస్థులు కంటతడి పెట్టించింది. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కుమారుడు, కూతురు ఉన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ


బుద్దె రాజేశ్వర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

బోధన్‌రూరల్, మే 3: బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి భర్త బుద్దె రాజేశ్వర్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని శుక్రవారం కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గండ గోవర్ధన్ పరామర్శించారు. ఈ సందర్భంగా బుద్దె రాజేశ్వర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. బుద్దె రాజేశ్వర్ మృతి నియోజకవర్గానికి తీరనిలోటని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఇల్తెపు శంకర్, సాలూర షకీల్, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జానకంపేట్‌లో చలివేంద్రం ఏర్పాటు


ప్రయాణికులకు మంచినీటిని అందిస్తున్న దృశ్యం

ఎడపల్లి, మే3: మండలంలోని జానకంపేట గ్రామంలోని చౌరస్తాలో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రతీరోజు రాకపోకలు జరిపే ప్రయాణికుల దాహాన్ని తీర్చేందుకు జానకంపేట సహకార సంఘం మాజీ అధ్యక్షుడు తాళ్ల విజయ్ కుమార్‌గౌడ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఉన్నారు.

దేశం మరింత అభివృద్ధి చెందాలంటే
మరోసారి నరేంద్రమోదీ ప్రధాని కావాలి

● బీజేపీ రాష్ట్ర నాయకుడు యెండల లక్ష్మీనారాయణ

రుద్రూరు, మే3: దేశం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి నరేంద్రమోదీ ప్రధాని కావాలని బీజేపీ రాష్ట్రనాయకుడు యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రుద్రూరులో శుక్రవారం పర్యటించి మాట్లాడారు. కరోనా కష్టకాలంలో ప్రజలను ఆదుకున్న ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని అన్నారు. వందరోజులు దాటినా ఆరు గ్యారంటీలను అమలు కాలేదని విమర్శించారు. ధర్మం, న్యాయం కోసం పోరాడే బీజేపీకి ప్రజలు పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కామారెడ్డి అధ్యక్షురాలు అరుణతార, రుద్రూరు మండలఅధ్యక్షుడు హరికృష్ణ, నియోజకవర్గ కన్వీనర్లు, ప్రభారీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటగిరి: కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించారు. రూ.2లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. రైతులకు బోనస్ ఇవ్వలేదని, మహిళలకు చేయూత పథకం కింద రూ2500 ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణ తార, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం, దెగ్లూర్ ఎమ్మెల్యే సామ్నే, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

డిచ్‌పల్లిలో ఆర్‌యూబీ నిర్మాణానికి మోక్షమెప్పుడో?

● నెరవేరని మండల ప్రజల కల ● ప్రతీసారి ఎన్నికల ప్రచారానికి వాడుకుంటున్న పార్టీలు ● ప్రస్తుత ఎంపీ అర్వింద్, మాజీ ఎంపీ కవిత హామీ ఇచ్చినా అమలుకు నోచుకోని వైనం

డిచ్‌పల్లి, మే3: డిచ్‌పల్లిలోని ఆర్‌యూబి నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి ఆర్‌యూబీ నిర్మిస్తామని అన్ని పార్టీలు ప్రచారానికి వాడుకుని ఎన్నికలు ముగియగానే విస్మరిస్తు న్నారు. దీంతో డిచ్‌పల్లిలో ఆర్‌యూబీ నిర్మాణ కలగానే మిగిలిపోతోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డిచ్‌పల్లి మండల కేంద్రం నుంచి ఘన్‌పూర్, డిచ్‌పల్లి, ముల్లంగి వైపు వెళ్లాలంటే రైల్వే ఘన్‌పూర్ రైల్వేగేటు దాటి వెళ్లాల్సి పరిస్థితి. ఇక్కడ సగటున రైళ్ల ప్రతీ 15నిమిషాలకు ఒకసారి రాకపోకలు సాగిస్తుంటాయి. రైలు వచ్చిన ప్రతీసారి రైల్వే గేటు మూత పడుతుంది. దీంతో ఇక్కడ చుట్టూ పక్కల గ్రామాలు ప్రజలు ఆర్‌యూబీ నిర్మించాలని గత 10 ఏళ్లుగా కోరుతున్నా పాలకులు మాత్రం కనీసం స్పందించడం లేదు. గతంలో ఎంపీలుగా పనిచేసిన మధుయాష్కీగౌడ్, కల్వకుంట్ల కవితలకు పలుసార్లు గ్రామాల ప్రజలు వినతులు అందజేసినా నిర్మాణానికి మాత్రం నోచుకోలేదు. ఒక అడుగు ముందుకు వేసిన మాజీ పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత రైల్వే ఆర్‌యూబీ నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతాన్ని సందర్శించి వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ఈ విషయం రైల్వే ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం చొరవ చూపుతానని ప్రకటించినా ప్రతిపలం కనబడలేదు. అనంతరం నిజామాబాద్ ఎంపీగా గెలిచిన ధర్మపురి అర్వింద్‌కు అనేకమార్లు స్థానికులు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు. డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు లేక నిత్యం రైల్వే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రైల్వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఫుట్‌ఓవర్‌బ్రిడ్జిని ప్రతీసారి ఎన్నికల్లో ప్రచారంలో ఆర్‌యూబీ వంతెన నిర్మిస్తామని అన్ని రాజకీయపార్టీలు ప్రచారానికి వాడుకుని అధికారంలోకి వచ్చాక అటువైపు కన్నెత్తి చూడటంలేదు. ఇది పార్లమెంట్ ఎన్నికల సమయం కావడంతో ఈ విషయంపై రాజకీయ పార్టీల నాయకులను నిలదీసేందుకు స్థానికులు, ప్రజలు సిద్ధమవుతున్నారు.


డిచ్‌పల్లి రైల్వేస్టేషన్


రైలు కింద నుంచి ప్రమాదకరంగా పట్టాలు దాటుతున్న స్థానికులు


ప్రతిపాదిత స్థలం

నిప్పుల కుంపటి

- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఎండతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలు, మూగజీవాలు
- రెడ్ జోన్‌లోకి రామారెడ్డి

కామారెడ్డి టౌన్, 3: కామారెడ్డి జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ సూర్యుడు నిప్పుల కుంపటి పెంచుతుండడంతో ప్రజలు, మూగజీవాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఇప్పటికీ జిల్లాలోని అనేక మండలాలు ఆరెంజ్ జోన్‌లోకి మారగా శుక్రవారం రామారెడ్డి మండల కేంద్రం రెడ్ జోన్‌లోకి చేరింది. జిల్లాలో సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఇండ్లలోంచి బయటకు రావాలంటేనే జంకే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండవేడిమి ఎక్కువగా నమోదవుతోంది. సాయంత్రం 6 గంటల వరకు సూర్యుడు నిప్పులు కురిపిస్తూనే ఉన్నాడు. రాత్రి 9 గంటల వరకు ఆ ఎండ వేడిమి తగ్గడం లేదు. రాత్రి 12 తర్వాతనే కొద్దిమేర చల్లటి వాతావరణం ఏర్పడుతున్నా ఉక్కబోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో నెల రోజులు ఈ ఎండలతో ఏ విధంగా గడుపుతామోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. మధ్యాహ్నం వేళలో ఇంటికే పరిమితం కావాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. అయితే పలుచోట్ల బయటకు వెళ్లి వచ్చిన వయస్సుపైబడిన వారు మృతి చెందుతుండడంతో వడదెబ్బ కారణంగానే మృతి చెందుతున్నారనే చర్చ కొనసాగుతుండగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ వడదెబ్బతో కాదని ఇతర కారణాలతో మరణిస్తున్నారని పేర్కొంటున్నారు.

జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు

రామారెడ్డి 45.4, బిచ్కుంద 44.7, దోమకొండ 44.6, కొల్లూర్ 44.2, పాత రాజంపేట 44.2, డోంగ్లీ 44.0, తాడ్వాయి 43.9, ఆర్గొండ 43.9, భిక్కనూర్ 43.8, బీర్కూర్ 43.7, ఎల్పుగొండ 43.6, హసన్‌పల్లి 43.6, సదాశివనగర్ 43.5, పిట్లం 43.5, నస్రూల్లాబాద్ 43.5, బీబీపేట 43.2, ముక్తుంపూర్ 43.1, లింగంపేట 42.9, బొమ్మన్‌దేవాయిపల్లి 42.8, మాచాపూర్ 42.7, లచ్చపేట 42.7, పెద్దకొడప్‌గల్ 42.5, ఇసాయిపేట 42.5, మేనూర్ 42.4, గాంధారి 42.3, జుక్కల్ 42.1, నాగిరెడ్డిపేట 41.8, సర్వాపూర్ 41.8, రామలక్ష్మణ్‌పల్లి 41.6, పుల్కల్ 41.4, సోమూర్ 41.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వడ దెబ్బ లక్షణాలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వేసవిలో ఎక్కువ మంది వడ దెబ్బ బారిన పడుతుంటారు. పిల్లల నుంచి పెద్దవారి వరకు వడ దెబ్బ బారిన పడిప్రాణాలను సైతం కోల్పోతుంటారు. దీంతో వైద్యాఆరోగ్యశాఖ అధికారులు వడదెబ్బ తగిలినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు చేస్తున్నారు. వడదెబ్బ తగిలినప్పుడు తీవ్రమైన శరీర ఉష్ణోగ్రత పెరిగి తలనొప్పిరావడం, నాడి వేగంగా కొట్టుకోవడం, నాలుక ఎండిపోవడం, చర్మం ఎండిపోవడం, నీరసంగా ఉంటూ తడబడటం, శరీరం నీటి శాతం కోల్పోవడం, మూత్రం పసుపు రంగులో ఉండి మంటగా రావడం, పాక్షికంగా లేదా పూర్తిగా అపస్మారక స్థితిలోకి చేరడం లాంటివి ఉంటాయి అట్లాంటప్పుడు వడదెబ్బ తగిలినట్టు గుర్తించాలి. ఇలా వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా చల్లని గాలి ఉన్న నీడ ప్రదేశానికి తరలించి దుస్తులు వదులు చేసి చల్లని గాలి తగిలేలా చేయాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. వీలయినంత త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలి. వేసవిలో నీరు, పళ్ల రసాలు, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. నలుపు మందంగా ఉండే వాటికి బదులు లేత రంగుల్లో లభించే తేలికైన కాటన్ దుస్తులను ధరించాలి. రోజు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి. ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి. ఇంట్లో కిటికీలు తెరిచి ఉంచాలి.





భిక్కనూరులో ఆశాలతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పోలింగ్‌బూత్‌లో మెడికల్ క్యాంపు ఏర్పాటు

- మండల వైద్యాధికారిణి యేమిమా

భిక్కనూరు, మే 3: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13న మండలంలోని ప్రతీ పోలింగ్ బూత్‌లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయడం జరుగుతుందని మండల వైద్యాధికారిణి యేమిమా తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటుగా మందులను అందుబాటులో ఉంచుకోవాలని, ఉదయం నుంచి పోలింగ్ సమయం ముగిసే వరకు తప్పకుండా ఆశాలు పోలింగ్ కేంద్రం వద్దనే ఉండాలన్నారు. ఏమైనా సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు ఆదర్శ్, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

భిక్కనూరులో ఆశా డే..

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు యేమిమా, ఆదర్శ్ ఆశాల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆశాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



భిక్కనూరులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

- అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కిరణ్ చైతన్య

భిక్కనూరు, మే 3: ప్రజలు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కిరణ్ చైతన్య అన్నారు. శుక్రవారం భిక్కనూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో ముద్రించిన విద్యుత్‌ను ఆదా చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల వాల్ పోస్టర్లను విద్యుత్ అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎల్ఈడీ బల్బులను వాడాలని, అనవసర సమయంలో ఫ్యాన్, బల్బు, ఇతరతర స్విచ్‌లను ఆపి వేయాలని, విద్యుత్ కుక్కర్‌కు బదులుగా ప్రెషర్ కుక్కర్‌లను వాడాలని, అవసరమైనప్పుడు మాత్రమే విద్యుత్‌ను వాడాలన్నారు. రైతులు వ్యవసాయ బావుల వద్ద విద్యుత్‌షాక్‌లకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రామలక్ష్మి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



బాగిర్తిపల్లిలో పనులను పరిశీలిస్తున్న దృశ్యం

బాగిర్తిపల్లిలో ఉపాధి పనుల పరిశీలన

భిక్కనూరు, మే 3: మండలంలోని బాగిర్తిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధిహామీ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి పని కల్పించాలని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కూలీలు కొలతల ప్రకారం పని చేయాలని సూచించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

తాడ్వాయిలో సమ్మర్ క్యాంపు ప్రారంభం

తాడ్వాయి, మే 3: తాడ్వాయి మండల కేంద్రంలో గురువారం రాత్రి సమ్మర్ క్యాంపు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువకులు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతీరోజు రాత్రి వేళలో వాలీబాల్ క్రీడాకారులకు ప్రత్యేకంగా కోచ్ ద్వారా వాలీబాల్ క్రీడా శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ శిక్షణను యువకులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండారు సంజీవులు, వైస్ ఎంపీపీ నర్సింలు, ఏఎస్ఐ సంజీవులు తదితరులు పాల్గొన్నారు

జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా షెట్కార్‌ను గెలిపించాలి

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి, మే 3: జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని వివిధ వార్డుల్లో పార్టీ కార్యకర్తలతో కలిసి తిరుగుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే భారీ నిధులు వస్తాయని ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవచ్చునని అన్నారు. ఇతర పార్టీల వారు ఎన్ని చెప్పినా నమ్మకూడదని, మూడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసిందని, ఆరు గ్యారంటీ పథకాల ద్వారా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఎన్నికలు అయిన తరువాత ప్రారంభిస్తామని ఇల్లు లేని ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ పథకం ద్వారా ఇంటిని నిర్మించుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మండల అధ్యక్షుడు సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, కార్యకర్తలు, గయాజుద్దీన్, వార్డు కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు సరైన వసతులు కల్పించాలి

కామారెడ్డి టౌన్, మే 3: ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ఉపాధి కూలీలకు నీరు, నీడ, వైద్యంకు సంబంధించిన అన్ని వసతులు కల్పించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లి అన్నారు. శుక్రవారం మండలంలోని మోడెగాంలో ఉపాధి పనులను పరిశీలించారు. పనులు నిర్వహిస్తున్న ప్రదేశంలో కూలీలకు కల్పించిన వసతులను పరిశీలించి పనులు సక్రమంగా నిర్వహించే విధంగా చూడాలని ఉపాధి కూలీ డబ్బులు పూర్తిగా అందేవిధంగా కొలతల ప్రకారం పనులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామ నర్సరీని పరిశీలించి మొక్కల ఎదుగుదల సక్రమంగా జరిగేలా రోజు నీటిని అందించాలని గృహాలకు అవసరపడే పండ్ల మొక్కలు రోడ్ల వెంబడి నీడనందించే చెట్లను జూన్ వరకు పెంచి సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో చందర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఏపీవో మధునాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ డిప్యూటీ కమిషనర్

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఐదుగురికి గాయాలు

నాగిరెడ్డిపేట, మే 3: మండలంలోని మాల్తుమ్మెద విత్తన క్షేత్రం వద్ద హైదరాబాద్-బోధన్ ప్రధాన రహదారిపై శుక్రవారం ద్విచక్ర వాహనాలు ఢీకొని ఐదుగురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాఘవపల్లి గ్రామానికి చెందిన భూమయ్య, రాజు, సాయిలు, ముగ్గురు కలిసి ఎక్టీవా పైన మెదక్‌కు వెళుతున్నారు. మెదక్ జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన పరుశురాం షైన్ బైక్‌పై మెదక్ వైపు నుంచి నాగిరెడ్డిపేట వైపు వెళుతుండగా మార్గమధ్యంలో మల్తుమ్మెద విత్తన క్షేత్రం వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాఘవపల్లి గ్రామానికి చెందిన భూమయ్య కాలు విరిగిపోగా, రాజు, సాయిలు పరుశురాంతో పాటు మాల్తుమ్మెద గ్రామానికి చెందిన దూదెకుల మోమిన్ పాషాలు గాయపడ్డారు. ఎస్సై రాజు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు



గిరిజన గురుకుల విద్యార్థులకు అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గురుకుల పాఠశాల విద్యార్థులకు సన్మానం

నసురుల్లాబాద్, మే 3: కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ బాన్సువాడ, గిరిజన గురుకుల పాఠశాల, ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మార్కులు సాధించినందుకు గిరిజన పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం శుక్రవారం విద్యార్థులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంజీరా నదిలో మహిళ మృతదేహం

పిట్లం, మే 3: మండలంలోని బొల్లక్‌పల్లి గ్రామ శివారులో గల మంజీరా నదిలో గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైందని ఎస్సై నరేష్ తెలిపారు. శుక్రవారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బోల్లక్‌పల్లి గ్రామ శివారులో గల మంజీరా నదిలో గుర్తుతెలియని మృతదేహం ఉందని స్థానికులు తెలపడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మహిళా మృతదేహం వయస్సు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు.



మంజీరా నదిలో గుర్తుతెలియని మహిళ శవం



గ్రీష్మను అభినందిస్తున్న షబ్బీర్‌అలీ

ఇదే స్ఫూర్తితో మంచి భవిష్యత్తుకు అడుగులు వేసుకోవాలి

కామారెడ్డి టౌన్, మే 3: పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులను శుక్రవారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సన్మానించారు. గౌతమ్ మోడల్ స్కూల్‌కు చెందిన అబ్బగాని జైహింద్ గౌడ్, హరికల కుమార్తె అబ్బగోని గ్రీష్మ 10/10 జీపీఏ సాధించడంతో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో మంచి జీపీఏ సాధించిన స్ఫూర్తితో మంచి భవిష్యత్తుకు అడుగులు వేసుకోవాలని అన్నారు. పదో తరగతి వరకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే విద్యార్థులకు ఏది మంచి ఏది చేడో నేర్పించే అవకాశాలు ఉంటాయని ఆ తర్వాత కళాశాల జీవితంలోకి అడుగుపెడుతున్నప్పుడు అనేక ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఆ ఒడిదుడుకులను ఎదుర్కొంటూ జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగడానికి కృషి చేయాలని అన్నారు.



ఎండలో మామిడిపండ్లను విక్రయిస్తున్న దృశ్యం

మండుటెండలో మామిడిపండ్ల అమ్మకాలు

బాన్సువాడ టౌన్, మే 3: రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబాలు వారివి. రోజంతా కష్టపడి చేస్తే వచ్చిన దాంతో ఇంటికి అవసరమైన సామగ్రిని తీసుకెళ్లి, ఉన్నదాంతో పిల్లలతో కలిసి సరదాగా గడుపుతారు. గత వారం రోజులుగా సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ప్రజలు ఇళ్లలోంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. అలాంటి మండుటెండలో సైతం బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మహిళలు మామిడి పండ్లను విక్రయిస్తున్నారు. గొడుగు నెత్తిన పెట్టుకుని అమ్మకాలు చేపడుతున్నారు. ఓ మహిళ తన చిన్నారితో కలిసి మండుటెండలో పండ్ల అమ్మకాలు చేపడుతుండడం చూసి పలువురు చిన్నారిపై జాలిపడ్డారు.

అటవీ భూమిని చదును చేసిన ట్రాక్టర్ల సీజ్



సీజ్‌చేసిన ట్రాక్టర్‌లను చూపుతున్న అటవీశాఖాధికారులు

రాజంపేట, మే 3: రాజంపేట మండల పరిధిలోహద్దు గుండా సమీప అటవీ ప్రాంతంలో భూమిని చదునుచేసిన రెండు ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు రేంజ్ అధికారి రమేష్ తెలిపారు. అటవి ప్రాంతంలో ట్రాక్టర్లతో దున్నుతున్నారనే సమాచారంతో అక్కడికి వెళ్లగా మెదక్‌జిల్లాకు చెందిన లక్ష్మన్, మహ్మద్‌గౌసుద్దిన్‌లు భూమిని చదునుచేస్తు కనపడగా వారిని అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌లను సీజ్‌చేసినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా భూమిని చదునుచేస్తున్న మలవత్‌బాలియా ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారులు ఫారుక్, బాబా, బీట్ అధికారులు మహేష్, లచ్చయ్య, రాజమణి, దేవేందర్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

బీర్కూర్, మే 3: మండలంలోని దామరంచ గ్రామానికి చెందిన బంగ్లా చింటూ(23) అనే యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దామరంచ గ్రామానికి చెందిన గంగామణి, లక్ష్మణ్ దంపతులకు బంగ్లా చింటూ అనే కుమారుడు ఉన్నాడు. చింటూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. తాగడం, పేకాట, బెట్టింగ్ తదితర వ్యసనాలకు బానిసై డబ్బుల కోసం నిత్యం తల్లిదండ్రులను వేధించేవాడు. చింటూ చెడు వ్యసనాలకు, అతడు చేసిన అప్పుల వల్ల తల్లిదండ్రులు గత రెండేళ్ల క్రితం రెండు ఎకరాల వ్యవసాయ భూమిని విక్రయించారు. అప్పులు కట్టేశారు. బాగుండాలని బుద్ధి చెప్పారు. అయినా చింటూ మారలేదు. తల్లి పేరిట ఉన్న రెండు గుంటల భూమిని అమ్మేసి తనకు డబ్బులు ఇవ్వాలని చింటూ గత రెండు నెలలుగా తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నాడు. చింటూ ఒత్తిడిని తట్టుకోలేక తల్లి గంగామణి, కొన్ని రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఇంటికి వచ్చేయాలని చింటూ రోజూ తన తల్లికి ఫోన్ చేస్తున్నాడు. అయినా తల్లి రాలేదు. గురువారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.



బంగ్లా చింటూ (ఫైల్)

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	మనజిమిల్ బాయ్స్
శాంతి	టిల్లు స్క్వేర్
ప్రియా 70	ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35	గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ

మహేశ్వర	ఆ ఒక్కటి అడక్కు
వెంకటేశ్వర	రత్నం

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

